క్లుప్తంగా

శిబిరాల్లో విధులు సక్రమంగా నిర్వహించాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాల్లో సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ మాచర్ల సుహాసిని ఆదేశించారు. మంగళవారం ఆమె పలు శిబిరాలను సందర్శించి వైద్యులు, సిబ్బందికి సూచనలు చేశారు. యాత్రికులకు ఏ విధమైన అసౌకర్యాలు కలుగకుండా చూడాలని.. తక్షణం వైద్య సహాయం అందించాలని అన్నారు. ప్రతి షిఫ్ట్‌లో అందించిన వైద్య సహాయాలను రిపోర్టు రూపంలో తప్పనిసరిగా పంపించాలని సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 10 పడకల ఆసుపత్రి, కొండపై గల ఓం టర్నింగ్ వద్ద గల 3 పడకల క్యాంపును ఆమె సందర్శించారు.

రేపటి యూటీఎఫ్ రణభేరిని విజయవంతం చేయాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం గుంటూరులో జరిగే రణభేరి సభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, ఏ.సుందరయ్యలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక, విద్యారంగ సమస్యలు పరిష్కరించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ఉద్యోగులకి సంబంధించిన ఆర్థిక డిమాండ్లన్నీ పరిష్కారం చేయాలని ఈ సదస్సు ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామని ఆయన వివరించారు.

నయన మనోహరంగా సంప్రదాయ నృత్యాలు



విజయవాడ కల్చరల్: దేవదాయ ధర్మాదాయ శాఖ, శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కనకదుర్గానగర్‌లోని కళావేదికపై కళాకారులు ప్రదర్శిస్తున్న అంశాలు నయన మనోహరంగా సాగుతున్నాయి. మంగళవారం నాటి కార్యక్రమంలో త్యాగరాజ స్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, రామదాసు, అన్నమయ్య, భారతీ తీర్థ స్వామి కీర్తనలకు పలువురు కళాకారులు నృత్యాలను అభినయించారు. రాంబాబు బృందం తాళ భజన, సుధారాణి, అన్నపూర్ణ రాగంపూడి అమూల్య, సాయిబాబు, నాగబాబు భక్తి సంకీర్తనలను ఆలపించారు. జీఎస్ మూర్తి భరతనాట్యం, ఎం.ప్రశాంతి, వి.ఉజ్వల్, ఎమ్.హేమకుమారి, బి.సాహిత్య, నందిత, శైలజ, ఎస్.అనిత, జయశ్రీ, బాలజీ, ఎం.పల్లవి సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. నిర్వాహకులు గంగాధర్, సైదా, రామకృష్ణలు పర్యవేక్షించారు. కళాకారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

అక్టోబరు 31 వరకూ ఓపెన్ స్కూల్ దరఖాస్తులకు గడువు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే పది, ఇంటర్మీడియట్ కోర్సుల దరఖాస్తులకు అక్టోబరు 31వ తేదీ వరకూ అపరాధ రుసుంతో గడువును పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆయా కోర్సుల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరణ, నగదు చెల్లింపులు అపరాధ రుసుం రూ.200లతో అక్టోబరు 31వ తేదీ వరకూ చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఏపీ ఆన్‌లైన్, మీ సేవా కేంద్రాలు, గ్రామవార్డు సచివాలయాలు, ఏపీ ఓపెన్‌స్కూల్ వెబ్‌సైట్ ద్వారా చెల్లించవచ్చని ఆయన వివరించారు.

దుర్గమ్మ సేవలో ప్రముఖులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ మంగళవారం రాత్రి దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు.

- దుర్గమ్మను తెలంగాణ రాష్ట్ర మెదక్ లోక్‌సభ సభ్యులు రఘునందనరావు మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి అమ్మవారి సన్నిధికి తీసుకెళ్లారు. అనంతరం వేద పండితులు ఆయనకు ఆశీస్సులందించారు.
- పాతబస్తీలోని పురాతన ఆలయమైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో స్వామి వారిని రాష్ట్ర మంత్రి, పలువురు శాసనసభ్యులు మంగళవారం దర్శించుకున్నారు. రాష్ట్ర కార్మిక, కర్మాగార, బాయిలర్స్, వైద్య బీమా సేవ శాఖల మంత్రివర్యులు వాసంశెట్టి సుభాష్, శాసనసభ్యులు సుందరపు విజయకుమార్, వేగుళ్ల జోగేశ్వరరావు తదితరులు స్వామి వారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామి వారి చెంతకు తీసుకెళ్లారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసిన మంత్రి, శాసనసభ్యులకు స్వామి వారి ప్రసాదాలను అందించారు.

గాయత్రీదేవిగా లోకనాయకి

- రెండో రోజూ అమ్మకు విశేష పూజలు
- ప్రత్యేక అలంకారాల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లు
- జగన్మాత నామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణాలు

దసరా శరన్నవరాత్రులు మంగళవారం కనులపండువుగా సాగాయి. ఆలయాల్లో కొలువైన లోకనాయకి భక్తులకు శ్రీ గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మను చూడటానికి భక్తులు ఆలయాలకు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. పొంగళ్లను తల్లికి నైవేద్యంగా సమర్పించి జగన్మాత ముందు ప్రణవిల్లారు.



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రసాద్ శర్మ పంచహారతుల సేవ నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ, శీరం వెంకట్రావు, మజ్జి ఈశ్వరరావు, కామందుల నరసింహరావులతో పాటు ఇతర కమిటీ సభ్యులు కళాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. భీమనవారిపేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మలు పూజా కార్యక్రమాలను జరిపించారు. పాలప్రాజెక్టు క్వార్టర్స్ సమీపంలోని గంగానమ్మ దేవాలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదుర్గా గాయత్రీ అర్చక యాగ్నిక పురోహిత సేవా సంఘం అధ్యక్షులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పర్యవేక్షణలో అర్చకులు అమ్మవారికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ఫౌండర్ బసవ కాశీ విశ్వనాథ్ దంపతులు, గౌరవ అధ్యక్షులు సుంకర వేంకటేశ్వరరావులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గాయత్రీదేవిగా అమ్మవారు



గాయత్రీదేవిగా చదును మహాలక్ష్మీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం కోళ్లఫారం రోడ్‌లో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శ్రీగాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. ఉభయ దాతలుగా వ్యవహరించిన స్థానిక దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిట్టినగర్ 47వ డివిజన్ పరిధిలోని కుండల మార్కెట్‌లోగల శ్రీ గంగా, దుర్గా, మారెమ్మ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో అమ్మవారు శ్రీగాయత్రీదేవిగా దర్శనం ఇచ్చారు. ఊర్మిళా సుబ్బారావు నగర్ గ్రామ దేవత పోలేరమ్మ దేవస్థానంలో అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. దేవస్థానం పాలకవర్గం అధ్యక్షులు సూరసాని రామిరెడ్డి నేతృత్వంలో అర్చకులు నగేష్ శర్మ నిర్వహించిన పూజా కార్యక్రమంలో కార్యదర్శి గుత్తావళి విజయబాబు, కోశాధికారి దొడ్డా వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి మాగం ఆత్మారాము తదితరులు పాల్గొన్నారు.



బాలాత్రిపుర సుందరీదేవిగా మహాలక్ష్మీ

సంతాన లక్ష్మిగా పద్మావతి అమ్మవారు..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో భ్రమరాంబ అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఖడ్గమాల ఇతర కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించారు. బ్రాహ్మణవీధిలో కొలువైన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో పద్మావతి అమ్మవారు సంతాన లక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి పర్యవేక్షించారు. శ్రీ చదును మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలోని అష్టలక్ష్ములు ఉపాలయంలో అమ్మవారు సంతాన లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పాతబస్తీలోని శేషయ్యవీధి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో, కొత్తపేట గంగానమ్మ దేవస్థానంలో, సైకంవారివీధిలోని శ్రీ దర్భేశ్వరస్వామి వారి దేవస్థానంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.



సంతాన లక్ష్మిగా పద్మావతి అమ్మవారు



భవానీపురం కోళ్లఫారం రోడ్‌లో వేడుకలు



శ్రీ గంగా, దుర్గా, మారెమ్మ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో..

భక్తులకు నదీ హారతులూ అందని ద్రాక్షే

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ దర్శనం అనంతరం కృష్ణమ్మ హారతులను వీక్షించేందుకు దుర్గాఘాట్‌కు వెళుతున్న భక్తులకు చేదు అనుభవం ఎదురవుతోంది. దుర్గాఘాట్‌లో రోజూ సాయంత్రం కృష్ణమ్మకు నవ హారతులు ఇస్తారు. అయితే మంగళవారం సాయంత్రం ఘాట్‌లోకి భక్తులు, యాత్రికులను అనుమతించలేదు. దీంతో ఘాట్ మొత్తం ఖాళీగా ఉన్నా ప్రమాదకర స్థితిలో నేషనల్ హైవేపై పిట్టగోడ వద్ద నిలుచుని కృష్ణమ్మ హారతులను వీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. నగరంలో అమ్మవారి ఉత్సవాలు, మరో వైపు అమరావతి ఉత్సవాలకు సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన వారికి కృష్ణమ్మ హారతులను వీక్షించే భాగ్యం లేకుండా చేయడం ఎంత వరకూ సబబని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

పారిశ్రామిక రంగాలపై పట్టు సాధించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మేనేజ్‌మెంట్ స్టడీస్ విద్యార్థులు పారిశ్రామిక రంగాలపై పట్టు సాధించాలని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అన్నారు. ఆ కళాశాల మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో ఎంబీఏ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు సంగం మిల్క్ ప్రొడ్యూసర్స్ లిమిటెడ్ ప్రాంగణాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల పర్యటనను కళాశాలలో ప్రారంభించిన చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ తమ రంగాలలో అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్, విభాగాధిపతులు చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

క్యాడర్ స్ట్రెంగ్త్ కుదింపు తగదు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆర్టీసీ సంస్థలోని నాన్ ఆపరేషన్ యూనిట్స్‌లో క్యాడర్ స్ట్రెంగ్త్‌ను కుదించడం తగదని.. అధికారులు తీసుకున్న ఈ నిర్ణయాన్ని పునస్సమీక్షించాలని ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ విన్నవించారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యాధరపురంలలోని ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్ వద్ద మంగళవారం గేట్ మీటింగ్ నిర్వహించారు.

దసరా ప్రాధాన్యతను దిగజార్చేలా..!

'విజయవాడ ఉత్సవ్'లో కనిపించని అమ్మ విశిష్టత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): 'విజయవాడ ఉత్సవ్' పేరుతో నగరంలో కూటమి నేతలు నిర్వహిస్తున్న వేడుకలు ఇంద్రకీలాద్రిపై కొలువున్న దుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవానికి తూట్లు పొడిచేట్లుగా ఉన్నాయని పలువురు విమర్శిస్తున్నారు. దసరా ఉత్సవాలను మరింత శోభయమానంగా నిర్వహిస్తామని చెబుతున్న కూటమి నేతలు అమ్మవారి ప్రాముఖ్యతను దిగజారుస్తున్నారంటూ మండి పడుతున్నారు. కేవలం కూటమి నేతల కోసమే హడావుడి చేస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నాయి.

మైసూర్ ఉత్సవాల పేరుతో బురిడీ..

దేశంలో మైసూర్ దసరా ఉత్సవాలకు చాలా ప్రాముఖ్యత ఉంది. అటువంటి ఉత్సవాలకు ధీటుగా విజయవాడ ఉత్సవ్ పేరుతో అమ్మవారి ప్రాధాన్యతను పెంచడానికి కార్యక్రమాలను నిర్వహిస్తామని కూటమి నేతలు ప్రకటించారు. మైసూర్‌లోని చాముండేశ్వరి అమ్మవారి ఉత్సవాలు, మైసూర్ మహారాజ వారి వైభవాన్ని చాటే కార్యక్రమాలు దసరా ఉత్సవాల్లో కొనసాగుతాయి. కానీ ఇక్కడ అందుకు భిన్నమైన అందాల పోటీలు, ఫ్లాష్‌మాబ్‌ల పేరుతో పాశ్చాత్య పోకడలను విస్తరింపజేసే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భారీ దోపిడీ కోసమే..

విజయవాడ ఉత్సవ్ పేరుతో నగరంలో భారీ దోపిడి చేస్తున్నారని పలువురు నేతలు విమర్శిస్తున్నారు. గొల్లపూడి ప్రాంగణంలో ఎగ్జిబిషన్ పేరుతో స్టాల్స్‌ను ఏర్పాటు చేసి ఒక్కో స్టాల్‌కు రూ.లక్షల్లో వసూలు చేశారు. అలానే మణిశర్మ, సునీత వంటి ప్రముఖుల సంగీత విభావరిల కోసం బుక్ మై షోలో టిక్కెట్లను నిర్వాహకులు భారీ రేట్లకు విక్రయిస్తున్నారు. హెలికాప్టర్ రైడ్ పేరుతో వసూలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. కార్యక్రమంలో ఎక్కడా నగరంలోని సామాన్యుల భాగస్వామ్యం లేదని పలువురు వాపోతున్నారు. ముఖ్యమైన కార్యక్రమాలకు టికెట్లు పెట్టి పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమం చేశారని.. విజయవాడ ఉత్సవ్‌కు ప్రభుత్వ పర్యాటక శాఖ నిధులు ఇస్తామని చెప్పడం, దసరా ఉత్సవాల్లో భాగస్వాములైన అధికారులను కూడా విజయవాడ ఉత్సవ్‌లో వినియోగించుకోవడంపై అధికార దుర్వినియోగమేనని వ్యాఖ్యానిస్తున్నారు.

పంచహారతుల సమయంలో క్యూలైన్లకు తాళాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకూడదనే భావనతో రూ.500 టికెట్లు రద్దు చేయడంతో పాటు అమ్మవారి పంచహారతుల సమయంలో బంగారు వాకిలి మినహా మిగిలిన అన్ని క్యూలైన్లు యథావిధిగా నడుస్తాయని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మీడియా సమావేశంలో వెల్లడించారు. ఇదే అంశాన్ని దసరా ఉత్సవ ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించిన ప్రతిసారి చర్చకు వచ్చింది. అయితే అధికారులు చెప్పినట్లే రూ.500 టికెట్ల విక్రయాలను రద్దు చేసినా.. పంచహారతుల సమయంలో క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులకు దర్శనం కలుగడం లేదు. సోమవారం సాయంత్రం పంచహారతుల సమయంలో అన్ని క్యూలైన్లకు తాళాలు వేయగా, ప్రముఖులు, వీఐపీలకే అమ్మవారి దర్శన భాగ్యం కలిగింది. ఈ ఏడాది పంచహారతుల సేవలో వీఐపీలు, విధుల్లో ఉన్న అధికారులకు కాకుండా క్యూలైన్‌లో వేచి ఉండే భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, దుర్గగుడి అధికారులు నిర్ణయించారు. ఈ నిర్ణయం వల్ల క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులకు పంచహారతుల సమయంలో అమ్మవారిని దర్శించుకునే భాగ్యం కలుగుతుంది. కాగా సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయడంలో అధికారులు తొలి రోజే విస్మరించారు. ఆలయ ప్రాంగణంలో విధులు నిర్వహిస్తున్న పోలీసు, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు ముందుగానే ఆలయంలోకి ప్రవేశించి క్యూలైన్‌లో వేచి ఉన్నారు. దీంతో పంచహారతులు ప్రారంభమైనా క్యూలైన్లు వదిలేందుకు సాధ్యం కాలేదు.



అమ్మవారి దర్శనానికి కిక్కిరిసిన భక్తులు

దర్శనానికి అనుమతించాలంటూ ఆందోళన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మంగళవారం రాత్రి తమను దర్శనానికి అనుమతించాలంటూ భక్తులు టోల్‌గేట్‌ను చుట్టుముట్టారు. రాత్రి 10 గంటల సమయంలో వినాయకుని గుడి వద్ద క్యూలైన్లలోకి భక్తులను నిలిపివేశారు. అలానే టోల్‌గేట్ వద్ద 10.30 గంటలకు నిలిపివేశారు. అయితే వినాయకునిగుడి వద్ద నిలిపివేసిన భక్తులు వేగంగా టోల్‌గేట్ వద్దకు చేరుకుని ఇంకా సమయం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

దుర్గమ్మ సేవలో ఎంపీలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దుర్గమ్మను మంగళవారం యూపీ రాష్ట్ర ఘూసి నియోజకవర్గ ఎంపీ, పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు రాజీవ్‌రాయ్ దర్శించుకున్నారు. అమ్మసేవలో విజయనగరం ఎంపీ కేపీ అప్పలనాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన ఘటనపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత రాజరాజేశ్వరిపేట జేపీ అపార్టుమెంట్‌కు చెందిన షేక్ నాసిర బేగం, సయ్యద్ ఉస్మాన్‌లు భార్యాభర్తలు. నాసిరబేగంకు గతంలో వివాహం కాగా భర్తతో విభేదాల కారణంగా సయ్యద్ ఉస్మాన్‌ను రెండో వివాహం చేసుకున్నారు. ఉస్మాన్ ఉద్యోగ రీత్యా సౌదీలో ఉంటున్నారు. నాసిర బేగంకు గత కొంతకాలంగా అనారోగ్యంతో మందులు వాడుతున్నారు. కాగా ఈనెల 21వ తేదీన నాసిర బేగం ఉదయం, సాయంత్రం వేసుకోవాల్సిన మందులను ఒకే సారి వేసుకున్నారు. దీంతో ఆమె అపస్మారక స్థితికి చేరుకోగా కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆమె మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఘటనపై నాసిర బేగం అన్న సయ్యద్ హానిఫ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

'కర్మణ్యే వాధికారస్తే' చిత్ర యూనిట్ సందడి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలో 'కర్మణ్యే వాధికారస్తే' చిత్ర యూనిట్ మంగళవారం సందడి చేసింది. భవానీపురంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో చిత్ర దర్శకుడు చల్లపల్లి అమర్‌దీప్ మాట్లాడుతూ.. సీనియర్ నటుడు బ్రహ్మాజీ, నటుడు మాస్టర్ మహేంద్రన్‌తో కలిసి నిర్మించిన చిత్రం 'కర్మణ్యే వాధికారస్తే' అని తెలిపారు. తమ సినిమాను అక్టోబరు 1న ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు తెలిపారు. ఇది తాను తెలుగులో నటిస్తున్న మొదటి చిత్రమని చిత్ర హీరోయిన్ యజ్ఞ పేర్కొన్నారు. మరో హీరోయిన్ ఆయేషా మాట్లాడుతూ.. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు విశేష స్పందన లభించడం సంతోషంగా ఉందన్నారు. తమ చిత్రాన్ని వీక్షించి ఆదరించాలని చిత్ర నిర్మాత డీఎస్ఎస్ ప్రసాద్ ప్రేక్షకులను కోరారు.

ఇంద్రకీలాద్రి పరిసరాల్లో చెప్పులతో సంచారం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవ వేళ ఇంద్రకీలాద్రిపై అపచారం చోటు చేసుకుంది. భక్తులు అత్యంత పవిత్రంగా భావించే ఆలయ, ఉపాలయాల పరిసరాల్లో ముగ్గురు వ్యక్తులు మంగళవారం కాళ్లకు చెప్పులు వేసుకుని తిరిగారు. అమ్మవారి దర్శనం తర్వాత బయటకు వచ్చే దారిలో నటరాజ స్వామి ఆలయం, గణపతి ఆలయం, పక్కనే శ్రీ గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వార్లకు కుంకుమార్చన నిర్వహించే ప్రాంగణం, వెనుక వైపు శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలు ఉన్నాయి. నటరాజస్వామి వారి ఆలయం నుంచి ముగ్గురు వ్యక్తులు నేరుగా కుంకుమార్చన ప్రాంగణం, సుబ్రహ్మణ్య స్వామి వారి ఆలయాల మీదగా లక్ష్మీ గణపతి ప్రాంగణం వైపు చెప్పులతో పరుగులు తీశారు. అమ్మవారి ఆలయ పరిసరాల్లోకి చెప్పులతో రాకుండా ఘాట్‌రోడ్డులోని పలు చోట్ల దేవస్థానం స్టాండ్‌లను ఏర్పాటు చేసింది. అయితే ఈ ముగ్గురు వ్యక్తులు ఆలయ పరిసరాల్లోకి చెప్పులు వేసుకొని రావడమే కాకుండా తాపీగా పరిసరాల్లో తిరుగుతూ కనిపించారు. భక్తులు, మీడియా సిబ్బంది వారిని నిలదీయగా ఏమీ పట్టనట్లు వారు పరుగులు పెట్టారు. ఇటువంటి వారిపై దేవస్థాన అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



ఆలయ పరిసరాల్లో చెప్పులతో తిరుగుతున్న వ్యక్తులు

నివేదన సమయాల్లో దర్శనం నిలిపివేత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువున్న దుర్గమ్మకు ప్రతిరోజు ఏడు పర్యాయాలు నివేదనలు చేయాల్సి ఉన్నందున ఆయా సమయాల్లో 15 నిమిషాల పాటు దర్శనాన్ని నిలిపివేస్తామని శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వహణ అధికారి శీనా నాయక్ తెలిపారు. మంగళవారం జరిగిన కార్యక్రమాలపై రాత్రి ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. తెల్లవారుజామున 3 గంటలకు బాల భోగ నివేదన, ఉదయం 6 గంటలకు చిత్రాన్నం నివేదన, ఉదయం 8:30 గంటలకు గుడాన్నం నివేదన, 10:30 గంటలకు రాజభోగ నివేదన, మధ్యాహ్నం 12 గంటలకు పంచ భోగ నివేదన, సాయంత్రం 4 గంటలకు విశేష భోగ నివేదన, సాయంత్రం 6:30 నుంచి 7:30 వరకు మహానివేదన ఉంటాయన్నారు. అందువల్ల ఆయా సమయాల్లో దర్శనాలు 15 నిమిషాల పాటు నిలిపివేస్తామని.. భక్తులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రెండో రోజు సాయంత్రం ఐదు గంటలకు సుమారుగా 60,641 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు వివరించారు. రాత్రి 11 గంటల వరకు అమ్మవారిని దర్శించుకునే అవకాశం ఉన్నందున ఈ సంఖ్య మరింత పెరగవచ్చునని తెలిపారు. చిన్నారులు తప్పిపోకుండా 3,695 ట్యాగ్‌లు చిన్నపిల్లలకు వేశామన్నారు. 19,629 మందికి అన్న ప్రసాదం అందించామన్నారు.

కళాక్షేత్రంలో అలరించిన కళాప్రదర్శనలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన పలు కళా ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అనూష నాయుడు బృందం, శ్రీనాట్య తరంగిణి నృత్య కళాశాల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అద్భుతంగా సాగాయి. అనంతపురానికి చెందిన సి.రాము ఉరుములు(వాయిద్య) ప్రదర్శన ఆద్యంతం అలరించింది. కాకినాడ మాధవపట్నానికి చెందిన సి.తోట బాలకృష్ణ ప్రదర్శించిన కిరాతార్జునీయం తోలు బొమ్మలాట వీక్షకులను కట్టిపడేసింది. ఈ సందర్భంగా తోలు బొమ్మలాట ప్రదర్శించిన కళాకారులకు గద్దె అనురాధ రూ.5 వేలు, నాటక అకాడమి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, కళాపోషకులు వేముల హజరత్తయ్య గుప్తా రూ.1000 చొప్పున బహూకరించారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, నగర మాజీ మేయర్ కోనేరు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



నృత్య ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులతో అతిథులు

మాతా గాయత్రీ పాహిమాం

దసరా ఉత్సవాలు ఇంద్రకీలాద్రిపై ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం లోకనాయకి దుర్గమ్మ శ్రీ గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేద మాతను చూడటానికి భక్తులు కొండపై బారులు తీరారు. రెండు చేతులూ జోడించి 'జగన్మాతా పాహిమాం' అంటూ అమ్మను చూసి ప్రణవిల్లారు. చల్లగా చూడు తల్లీ.. మళ్లీ వస్తామమ్మా అంటూ మొక్కులు చెల్లించుకున్న భక్తులు మోకరిల్లారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు



కుంకుమ పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



సాంస్కృతిక కార్యక్రమాల్లో నృత్య ప్రదర్శనలు



గ్రాయత్రీ నమోస్తుతే..